## అన్నా క్యాంటీన్ ప్రారంభించిన మాజీ మంత్రి



పలమనేరు, జనవరి 18, ప్రభాతవార్త:
పట్టణంలో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతిని మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ,కార్యకర్తలు నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని మార్కెట్ కమిటి వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నూతనంగా అన్నా క్యాంటీన్‌ను మాజీ మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్‌ను ప్రజలు ఓ దేవునితో సమానంగా ప్రజలు చూస్తున్నారన్నారు. ఆయన పేరుపై పేదలకు భోజనాలు అందిస్తుంటే వైకాపా ప్రభుత్వం కక్షసాదింస్తు మూసివేసిందని అయితే పట్టణంలో ఆయన 27వ వర్ధంతి సందర్భంగా అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేశామన్నారు.ఆయన అధికారంలోకి వచ్చి చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ఇప్పటి వరకు ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## ముగిసిన కొండచుట్టు

### కన్నుల పండువగా తోటోత్సవం



చంద్రగిరి, జనవరి 18 ప్రభాతవార్త:
చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి కొండచుట్టు మహోత్సవం అంగరంగ వైభవంగా ముగిసింది. భీమసేనుడు, అర్జునుడు, ద్రౌపధి అమ్మవారు వెంటరాగా శ్రీమూలస్థాన ఎల్లమ్మ వారు కొండచుట్టు ముగించుకుని బుధవారం ఆలయానికి చేరుకున్నారు. సంక్రాంతి మహోత్సవాలలో భాగంగా ఉదయం భీమసేనుడు, అర్జునుడు, ధ్రౌపధి అమ్మవారు వసంతాలాడుతూ కొత్తపేటలోని శ్రీ వీరబ్రహ్మంగారి ఆలయానికి చేరుకున్నారు. రాత్రి అమ్మవారి తోటోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అన ంతరం అమ్మవారు తిరిగి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ పుట్టా రామ కృష్ణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# హడలెత్తిస్తున్న వరుస చోరీలు!

### తిరుపతిలో పోలీసులకు సవాల్‌గా మారిన దొంగలు! -పదేళ్లక్రిందటి పరిస్థితులు పునరావృతం?!



ప్రభాతవార్త-తిరుపతి:
నేరాల కట్టడిలో పోలీసుల పనితీరు సవ్యంగా ఉండటంలేదా!?నేరస్తుల కదలికలపై డేగకన్ను ఉంచి అంచనా వేయడంలో పట్టుతప్పుతున్నారా?? విధి నిర్వహణలో ఒత్తిడి అధికం కావడంతోనే గస్తీకి సుస్తీ చెబుతున్నారా!!అనే ప్రశ్నలకు పోలీసువర్గాల నుంచి సమాధానం ఎలా ఉన్నా ప్రజలు మాత్రం ఇటీవల జరుగుతున్న వరుస చోరీలతో హడలిపోతున్నారు. తాళంపడిన ఇళ్ళను దొంగలు టార్గెట్ చేయడమేగాక ఆలయాలను వదలడం లేదంటే నేరప్రవృత్తి కలిగిన తమిళనాడు,కర్నాటక, తెలుగురాష్ట్రాలతో బాటు బీహార్, ఒరిస్సా ప్రాంతాలకు చెందిన నేరస్తులు తిరుపతిలో మకాంవేసి చోరీలకు పాల్పడుతున్నారనేది పోలీసువర్గాల అనుమానం. ఇప్పుడు తిరుపతి నగరవాసులతోబాటు శివారుప్రాంతాల్లోని ప్రజల్లో దొంగతనాల భయం పట్టుకుంది. దీనికితోడు నగర శివార్లలో విస్తరించిన అపార్టుమెంట్లతోబాటు పక్కపక్కన నిర్మితమైన ఇళ్ళు ఎక్కువగానే ఉంటున్నాయి. శివారుప్రాంతాల్లో సిసికెమెరాల ఏర్పాటు అంతంతమాత్రంగానే ఉండటం, ప్రతి ఇంటికి సిసి కెమెరాలు అమర్చుకోవాల్సిన అవసరం ఉన్నా నిర్లక్ష్యం చూపడం, తాళం వేసి ఊర్లకు వెళ్ళే కుటుంబాల సభ్యులు సమీప పోలీసులకు సమాచారం ఇవ్వకపోతుండటం వంటి లోపాలతో దొంగతనాలకు కారణంగా మారాయి. ఇటీవల వరుసగా మూడురోజులుగా నగరశివార్లలోని పలు కాలనీల్లో జరిగిన దొంగతనాలు ఒకే తరహాలో ఉండటంతో ఏ రాష్ట్రానికి చెందిన నేరముఠా పాల్గొన్నదని ఆరా తీయలేకపోతున్నారు. సంక్రాంతిపండుగ ముందురోజు నగరశివార్లలోని ఆంధ్రాబ్యాంకుకాలనీలో వరుసగా రెండిళ్ళ తాళాలు పగలగొట్టిన దొంగలు భారీగానే విలువైన వస్తువులు చోరీచేసుకెళ్ళారని బాధితులు తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మళ్ళీ సోమవారంరాత్రి వసంతనగర్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగింది. తలుపులు తెరచి వుండటంతో స్థానికులు గమనించి తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి నగరశివార్లలోని అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్‌గాంధీకాలనీ,ఎస్ఎల్వి నగర్‌రెండవ వీధిలో ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. టిటిడి ఉద్యోగి కుటుంబం ఇంటికి తాళంవేసి స్వగ్రామంవెళ్ళారు. బుధవారం ఉదయం ఇంటితలుపులు తెరచివుండటంతో గమనించి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 120 గ్రాముల బంగారం, వెండినగలతోబాటు ఐప్యాడ్,నగదు అఫహరణకు గురైనట్లు బాధితులు గుర్తించారు. ఇదేరోజు తిరుపతి రూరల్ పేరూరు బండపై ఉన్న వకుళమాత ఆలయంలో చోరీ జరిగింది. దుండగుడు ఆలయం వెనుకవైపు నుంచి ప్రవేశించి గడ్డపారతో తాళాలు పగలగొట్టాడని, హుండీలో నగదు చోరీ చేశాడు. ఈ నగదు మొత్తం మూటగట్టి పరారయ్యేందుకు ప్రయత్నించిన సమయంలో దుండగుడు భయపడి నగదు మూటను ఆలయంప్రాంగణంలోనే వదలిపెట్టి పరారయ్యాడు. సిసిటివి ఫుటేజ్‌ల్లో నమోదైంది. ఎంఆర్‌పల్లి పోలీసులు ఆదిశగా దర్యాప్తు మొదలుపెట్టారు. ఇంకా రేణిగుంట మండలం గాజులమండ్యంలోని ఎల్లమ్మ ఆలయానికి ఉన్న ఇనుపగ్రిల్స్ తొలగించిన దొంగలు అమ్మవారికి అలంకరించిన 8 తాళిబొట్లు, వెండి కిరీటం, మకరతోరణ: దొంగతనం చేసుకెళ్ళారని గుర్తించారు. ఇలా ఆలయాల్లోనూ చోరీలు జరుగుతుండటంతో దొంగలు తమిళనాడు ప్రాంతానికి చెందినవారేగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో సిసికెమెరాలు ఉన్నా దొంగలు చోరీలు చేయడంతో పోలీసులకు సవాల్‌గా మారారు. పోలీసులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ...నేరాలకట్టడికి పనితీరు సాగిస్తున్నా....నేరస్తుల కదలికలపై మరింతగా నిఘావుంచడం తప్పితే పదిసంవత్సరాల క్రిందటి నేర పరిస్థితులు పునరావృతమవుతున్నాయనే ఆందోళన జనంలో వ్యక్తమవుతోంది.

## ఎల్లమ్మ అమ్మవారి గుడిలో దొంగలుపడ్డారు

### ఒకటిన్నర కేజీ వెండీ ఆభరణాలు
### న 16 గ్రాముల మంగళసూత్రాలు అపహరణ

రేణిగుంట, జనవరి 18 ప్రభాతవార్త:
దొంగతనానికి కాదేది అనర్హమని దొంగలు ఎల్లమ్మతల్లి గుడిలోనే దొంగతనానికి పాల్పడ్డారు. అమ్మవారి మెడలోని ఒకటిన్నర కేజీ వెండీ ఆభరణాలు, వెండీ వస్తువులు, 16 గ్రాముల మంగళ సూత్రాలు తస్కరించి ఉడాయించారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. అమ్మవారికే రక్షణ లేకపోతే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాజులమండ్యం పోలీసుల కథనం మేరకు... ఎవరో కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు రేణిగుంట పట్టణ శివారు సీబీఐడీ కాలనీ సమీపంలోని శ్రీ ఎల్లమ్మతల్లి గుడిలో గేటు గ్రిల్స్ వంచి గర్భగుడి తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. తెలుసుకుని వెంటనే ఎస్ఐ ధర్మారెడ్డి, రూరల్ సీఐ ఆరోహణరావు ఆదేశాల మేరకు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దేవాలయం ముందున్న గ్రిల్స్‌ను గడ్డపార లాంటి ఆయుధంతో వంచేసి దుండగులు ఆలయంలోకి ప్రవేశించారు. గర్భగుడి తాళం పగులగొట్టి ఎల్లమ్మతల్లి అలంకరించిన వెండీ ఆభరణాలు, వెండీ వస్తువులు, సుమారు 16 గ్రాముల మంగళ సూత్రాలను దొంగలించుకుని పారిపోయారు. వీటి విలువ సుమారు రూ.1 లక్షా 60 వేలు వరకు ఉంటుందని భావిస్తున్నారు. ఎస్ఐ ధర్మారెడ్డి క్లూజ్ టీమ్‌ను పిలిపించి విచారణ వేగవంతం చేశారు.



దొంగలు పడ్డ దేవాలయం, నగలు ఉన్నప్పుడు అమ్మవారు, ప్రస్తుతం అమ్మవారు

### శ్రీవకుళమాత ఆలయంలో

# అర్ధరాత్రి చోరీ

### - చోరీ దృశ్యాలు సిసి పుటేజ్‌లో రికార్డు
### యం.ఆర్.పల్లి పోలీసులు దుండగుల కోసం గాలింపు



తిరుపతిరూరల్, జనవరి18 ప్రభాతవార్త:
తిరుపతిరూరల్ మండలం పేరూరు బండపై వెలసిన శ్రీవకుళమాత ఆలయంలో చోరీ జరిగింది. బుధవారం ఆర్థరాత్రి దుండగలు ఆలయ గర్భ గుడిలోకి ప్రవేశించి హుండీని బద్దలు కొట్టారు. హుండీలోని నగదును మూటగట్టి పారిపోయే ప్రయత్నం చేయగా అలికిడితో భద్రత సిబ్బంది అప్రమత్తం కాగా దుండగలు హుండి డబ్బులను అక్కడికక్కడే వదిలేసి వెళ్ళారు. టిటిడి అనుబంధ ఆలయమైన వకుళమాత ఆలయంలో చోరీ ప్రయత్నం విఫలమైంది. భద్రత సిబ్బంది కన్నుగప్పి, దుండగలు ఆలయం వెనక భాగం నుండి కొండ ఎక్కి, ఆలయంలో ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్‌ను గడ్డపారతో తొలగించి ముండీ చోరీ చేసారు. ఇదే క్రమంలో చోరీ చేసిన నగదు మూట క్రిందపడటంతో అలికిడి భద్రత సిబ్బంది హుటాహుటీన గర్భాలయంలోకి వెళ్ళగా, భద్రత సిబ్బందిని చూసి దుండగలు పారిపోయారు. ఈ దశ్యాలు సిసి పుటేజ్‌లో నమోదైయ్యాయి. భద్రత సిబ్బంది, స్థానికులు ముత్యాలరెడ్డిపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చోరిపై దర్యాప్తు చేస్తున్నారు. టిటిడి విజిలెన్స్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ రంగంలోకి వ్రెలి ముద్రలను సేకరించారు. చోరీకి గురై విఫమైన నగదు మూటను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అమ్మవారి ఆలయంలో ఇంకెమైన చోరి గురైయ్యాయని కోణంలో పోలీసులు ధర్యాప్తు చేస్తున్నారు. భద్రత సిబ్బంది నిర్లక్ష్యంపై పోలీసులు ఆరా తీసారు.

- వకుళమాత ఆలయానికి సందర్శించిన టిటిడి బోర్డు సభ్యులు పోకల

వకుళమాత ఆలయంలో చోరి విషయం తెలుసుకున్న టిటిడి బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్ వకుళమాత అలయాన్ని సందర్శించారు. మహిమ కలిగిన అమ్మవారి ఆలయంలో ఎవ్వరు చోరీ చేయలేరని పోకల అశోక్‌కుమార్ అన్నారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృఢ సంకల్పంతో అమ్మవారి ఆలయం పున: నిర్మితమైందని తెలిపారు.

## దేశంలోనే పెద్ద మురికినీటి శుద్ధి కేంద్రం తిరుపతిలో ఏర్పాటు

### మురికి నీరును శుద్ధి చేసి వినియోగంలో తెస్తాం
### ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ



మురికి నీరు శుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తిరుపతి కార్పొరేషన్, జనవరి 18, ప్రభాతవార్త
దేశంలోనే పెద్ద మురికినీటి శుద్ధి కేంద్రం తిరుపతిలో ఏర్పాటు చేస్తామని, మురికినీరును శుద్ధి చేసి వినియోగంలో తెస్తామని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. బుధవారం తిరుపతి వినాయక సాగర్ పక్కన 5 ఎంఎల్‌డి మురికినీటి శుద్ధి కేంద్రాన్ని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డా. శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి నగరంలోని ఒక వైపు నుండి డ్రైనేజి నీరు ఇంతకు మునుపు వినాయకసాగర్‌లోకి చేరడం జరిగేదని, ఇప్పుడు మురికినీటి శుద్ధి కేంద్రం వినియోగంలోకి రావడం వలన రోజుకి 50 లక్షల లీటర్ల మురికి నీటిని వివిధ దశల్లో శుద్ధి పరిచి పూర్తి స్థాయిలోమంచినీటిగా మార్చి వినాయక సాగర్‌కు తరలించడం జరుగుతుందన్నారు. అదే విధంగా వినాయక సాగర్ నిండిన తరువాత మిగిలు నీటిని వ్యవసాయానికి మళ్లించడం జరుగుతున్నదన్నారు. తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డా. శిరీష, కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ స్మార్ట్ సిటి నిధులతో సుమారు 14 కోట్ల ఖర్చుతో రోజుకి 50 లక్షల లీటర్ల మురికినీటిని శుద్ధి చేసి మంచి నీటిగా మార్చడం జరుగుతుందన్నారు. భూగర్భ జలాలు చాలా వరకు కలుషితం కాకుండా కాపాడడంలో ఈ ప్లాంట్ ఎంతో ఉపయోగపడుతుందని మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. ప్లాంట్ గురించి ఎస్ఈ మోహన్, కాంట్రాక్టర్ భానుదయ్య రెడ్డిలు వివరిస్తూ ప్లాంట్‌లోకి వచ్చిన మురికి నీటిని ఏఏ దశల్లో శుద్ధి చేయడం జరుగుతుందనే విషయాలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టాండింగ్ కమిటి సభ్యులు ఎస్‌కె బాబు, కార్పొరేటర్లు ఆదం రాధాకృష్ణారెడ్డి, అనీల్ కుమార్, రామస్వామి వెంకటేశ్వర్లు, హనుమంత నాయక్, నారాయణ, ఆంజినేయులు, తిరుపతి మునిరామిరెడ్డి, ఎస్ఈ మోహన్, డిఈ విజయకుమార్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణతదితరులు పాల్గొన్నారు.

## నూతన అదనపు ఎస్పీగా జె. వెంకటరావు

తిరుపతి క్రైం, జనవరి 18, ప్రభాతవార్త
జిల్లా పోలీస్ కార్యాలయంలో పరిపాలన విభాగానికి నూతన అదనపు ఎస్పీగా జె. వెంకటరావు బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈయన 2012 బ్యాచ్ గ్రూప్ 1 ఆఫీసర్‌గా పోలీస్ శాఖనందు నియమితులై డిఎస్పిగా వెస్ట్ గోదావరి, అనంతపురం కర్నూల్ నందు విధులు నిర్వహించి పదోన్నతి పై గుంటూరు ఏసిబి నందు విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై తిరుపతి జిల్లా పరిపాలన విభాగానికి వచ్చారు.

### నేటి నుండి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ క్యాంప్‌లు
### కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతిరూరల్, జనవరి18 ప్రభాతవార్త:
తిరుపతి జిల్లాలో ఈనెల 19 నుండి 21వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో, 23, 24 తేదీలలో అన్ని మండలాలు, మునిసిపాటీల పరిధిలో ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని, 5-15 సంవత్సరాల వయస్సుదాటిన బాలబాలికలు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోవాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆధార్ క్యాంప్‌లలో నూతన ఆధార్ కార్డు నమోదు, 5 నుండి 15 సంవత్సరాలు దాటిన పిల్లలకు బయోమెట్రిక్ అప్డేట్ సేవలు పూర్తి ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. తిరుపతి జిల్లా నూతనంగా ఏర్పడిన తర్వాత పౌరులు తమ ఆధార్ ప్రాధికార సంస్థ ద్వారా కల్పించబడినట్లు తెలిపారు. తిరుపతి జిల్లాలోని ప్రజలందరూ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. సమీపంలోని ఆధార్ క్యాంప్‌లు యొక్క వివరాల కోసం సమీప గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించాలన్నారు.

## చంద్రబాబును కుప్పంలో ఖచ్చితంగా ఓడిస్తాం

### రాజంపేట ఎం.పి. మిథున్‌రెడ్డి



కుప్పం, జనవరి 18 ప్రభాతవార్త
ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడును కుప్పం నియోజకవర్గంలో ఖచ్చితంగా ఓడిస్తామని రాజంపేట ఎం.పి., లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ పి.వి. మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కుప్పం ఎం.ఎం. మహల్‌లో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న అనంతరం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి లభిస్తున్న ప్రజాదరణ చూసి ఫ్రస్టేషన్‌లో ఉన్నారన్నారు. ఆయనకు విలువలు లేవన్నారు. ఇటీవలే పండగపూట పీలేరుకు వచ్చి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. ఉన్నవి లేనివి చూపడం కాక చంద్రబాబు ప్రజల్లో వెళ్లి గెలవాలని పేర్కొన్నారు. కుప్పంలో చంద్రబాబు పర్యటనలకు వచ్చినపుడు దేశం శ్రేణులు స్వైరవిహారం చేస్తున్నారన్నారు. కుప్పంలో నారా లోకేష్, కెఎ పాల్, పవన్ కళ్యాణ్, సిబిఐ లక్ష్మీనారాయణ ఎవరైనా పాదయాత్రలు చేసుకోవచ్చని అయి తే నిబంధనలు పాటించాల్సి ఉంటుందన్నారు. చంద్రబాబు లాగా లోకేష్ మాట్లాడితే సహించేది లేదన్నారు. కుప్పంలో ఇదివరకు చంద్రబాబునాయుడు దొంగ ఓట్లతో గెలిచారన్నారు. కుప్పం మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా కేవలం యాభైశాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయన్నారు. గతంలో దివంగత చంద్రమౌళి కొంతమేర కుప్పంలో దొంగ ఓట్లను తగ్గించారన్నారు. కుప్పంలో 2.20లక్షల ఓటర్లు ఉంటే 1.23లక్షల మంది ఓటర్ల ఆధార్ మాత్రమే లభ్యమైందన్నారు. సుమారు 36వేల దాకా దొంగ ఓట్లు ఉన్నాయని ఈ విషయంగా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమీషన్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తామన్నారు. కుప్పం నియోజకవర్గంలో బిసిలు అధికంగా ఉన్నారని కుప్పం నుంచి ఎమ్మెల్యేగా భరత్‌ను గెలిపించాలని పేర్కొన్నారని కుప్పంలో భరత్‌ను ప్రజలు గెలిపిస్తారన్నారు. సమావేశంలో చిత్తూరు ఎం.పి. రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెస్కోఛైర్మన్ సెంధిల్‌కుమార్, ఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, పరిశీలకుడు రెడ్డెప్ప, రాష్ట్ర నేత కృష్ణమూర్తి, పికెఎం ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ వనిత శ్రీనులు పాల్గొన్నారు.

# షార్‌లో ఆగని ఆత్మహత్యలు

### - సిఐఎస్ఎఫ్ ఎస్ఐ భార్య ఆత్మహత్య
### - అతిథిగృహంలోనే విషాదం
### - అనాధలైన ముగ్గురు పిల్లలు

శ్రీహరికోట (తడ), జనవరి 18 ప్రభాతవార్త
శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో ఆత్మహత్యలు తీవ్ర సంచలనంగా మారాయి. ఇప్పటికే ఇద్దరు సిఐఎస్ఎఫ్ సిబ్బంది మృతిచెందగా, వారి కుటుంబ సభ్యుల్లోనూ ఆత్మహత్యలు మొదలయ్యాయి. ఈ నెల 15న షార్‌లో సిఐఎస్ఎఫ్ పోలీసు చింతామణి (29) జీరోపాయింట్ సమీపంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. 16వ తేదీ షార్ మెయిన్‌గేటు వద్ద విధులు నిర్వహిస్తున్న సిఐఎస్ఎఫ్ ఎస్ఐ వికాస్‌సింగ్ (35) తుపాకీతో కాల్చుకొని మృతిచెందాడు. బుధవారం తెల్లవారుజామున శ్రీహరికోటలోని నర్మదా అతిథిగృహంలో వికాస్‌సింగ్ భార్య ప్రియాసింగ్ (29) ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీనితో శ్రీహరికోటలో రక్షక దళాలతో పాటు షార్ శాస్త్రవేత్తలు, అధికారులు, ఉద్యోగులు కూడా కలవరపాటుకు గురవుతున్నారు. ఈ వరుస ఆత్మహత్యలకు కేవలం కుటుంబ సమస్యలే కారణమని తెలుస్తున్నప్పటికీ దీనివెనుక ఇంకేదైనా ప్రమాదకరమైన ప్రభావం ఉందా అన్నది కూడా చర్చించుకుంటున్నారు. అత్యంత భద్రతా స్థలమైన భారత అంతరిక్ష పరిశోధనకు గుండెకాయలాంటి షార్ కేంద్రంలో ఈ వరుస సంఘటనలు విషాదంతో పాటు విద్రోహంపైనా అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. రక్షకదళ సిబ్బందికి భద్రత లేకపోతే షార్‌లో ఎంతో విలువైన స్వదేశీ, విదేశీ శ్రమశక్తితో తయారు చేసిన రాకెట్లు, ఉపగ్రహాలకు భద్రత ఉంటుందా అంటూ ప్రశ్నలు వెంటాడుతున్నాయి.



షార్‌లో ఉరేసుకొని మృతిచెందిన ప్రియాసింగ్

### అతిథిగృహంలోనే ప్రియాసింగ్ ఆత్మహత్య

సిఐఎస్ఎఫ్ ఎస్ఐ వికాస్‌సింగ్ మృతితో ఆయన కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఉత్తరప్రదేశ్ నుంచి వికాస్‌సింగ్ భార్య ప్రియాసింగ్‌తో పాటు ఆమె సోదరుడు, మామ తదితరులు షార్‌కు హుటాహుటిన చేరుకున్నారు. మంగళవారం వీరు వచ్చేసరికి పొద్దుపోవడంతో పోలీసులు వికాస్‌సింగ్ శవం పోస్టుమార్టం బుధవారం జరపాలని నిర్ణయించారు. అతని భార్యతో పాటు వచ్చిన బంధువులు నర్మదా అతిథిగృహంలో ఉండేలా ఏర్పాట్లు చేశారు. అప్పటికే సిఐఎస్ఎఫ్ దళాలు, శ్రీహరికోట పోలీసులు కూడా ప్రియాసింగ్‌తో పాటు కుటుంబసభ్యులను విచారించారు. తెల్లవారుజామున అదే అతిథిగృహంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ప్రియాసింగ్ మృతిచెందింది. దీనితో దిగ్భ్రాంతికి గురైన కుటుంబసభ్యులు సిఐఎస్ఎఫ్ పోలీసులకు సమాచారం అందించారు. వారు శ్రీహరికోట పోలీసులకు కూడా వెంటనే చేరవేశారు. ఇక బుధవారం భార్య, భర్త శవాలను సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రిలో ఒకేసారి పోస్టుమార్టం చేశారు. ఇది తీరని విషాదం. సిఐఎస్ఎఫ్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వికాస్‌సింగ్ ఇంతకుముందు ముంబాయిలోని బాబా అటామిక్ రీసెర్చ్‌సెంటర్‌లో విధులు నిర్వహించినట్లు తెలుస్తోంది. 2015 బ్యాచ్‌కు చెందిన సింగ్ శిక్షణ అనంతరం ముంబాయిలో పనిచేసి అనంతరం భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోటకు వచ్చారు. గత నవంబర్‌లో ఇక్కడ ఎస్ఐగా చేరిన ఆయనకు భార్యతో పాటు కుమారుడు కన్హాసింగ్ (4), ఇద్దరు కూతుర్లు ఉన్నారు. వీరిలో ఒకరు దివ్యాంగురాలుగా చెప్తున్నారు. గతంలో పనిచేసిన చోట వికాస్‌సింగ్ ఒడిదుడుకులను ఎదుర్కొన్నారని, ఆ ప్రభావమే ఆయన ఆత్మహత్యకు దారి తీసిందని కొందరు అంటున్నారు. అయితే భర్త మరణంతో భార్యకు ఉద్యోగం వస్తే ముగ్గురు బిడ్డలను చూసుకుంటుందని నమ్మిన వికాస్ సింగ్‌కు భార్య కూడా 24 గంటల వ్యవధిలోనే నీ వెంటనే నేను అంటూ ఆత్మహత్యకు పాల్పడటం కొసమెరుపు. ప్రస్తుతం ముగ్గురు బిడ్డలు అనాధలు కాగా, భార్యభర్తల శవాలను పోస్టుమార్టం అనంతరం ఉత్తరప్రదేశ్‌కు తరలించారు.

## తెలుగు ప్రజల ఆరాధ్య దైవం ఎన్టీఆర్

కల్లూరు, జనవరి 18 ప్రభాతవార్త

దివంగత ముఖ్యమంత్రి ఎన్టీరామారావు తెలుగు ప్రజల ఆరాధ్య దైవంఅని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు రామనాథం నాయుడు అన్నారు. బుధవారం పులిచెర్ల మండలంకల్లూరు, కొత్తపేట గ్రామాలలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగానిర్వహించారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసినివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు కృష్ణమూర్తినాయుడు, ఉపాధ్యక్షుడు ఇనాయతుల్లా,ఎంపీటీసీ మునికృష్ణమనాయుడు, నాయకులు సుబ్బారెడ్డి, మురళీధర్‌నాయుడు, గోపినాయుడు,నూర్‌భాషా, నారాయనస్వామినాయుడు, నాగరాజు, అన్సర్‌భాషా,అశ్రఫ్, రామకృష్ణమనాయుడు, రవి,రమేష్,సుదర్శన్‌నాయుడు, యుగంధర్ బాబు,సర్దార్,సుబ్రమణ్యంనాయుడు,మునీంద్ర,పరందామనాయుడు,సాగర ,శివ తదితరులు పాల్గొన్నారు.

## బోడిపాటివ్వారిపల్లెలో రైతు పొలంబడి కార్యక్రమం



రొంపిచెర్ల, జనవరి18ప్రభాతవార్త

వ్యవసాయ పంటలలో ఉన్న మిత్ర పురుగులను రైతులు కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధారాణి అన్నారు. బుధవారం బోడిపాటివారి పల్లెలో రైతు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈసందర్భంగా వ్యవసాయపంటల సాగుపై అవగాహన కల్పించారు. మిత్ర పురుగులు శత్రు పురుగులనునాశనం చేస్తాయని చెప్పారు.అయితే రైతులు రసాయనిక పురుగు మందులు వాడకం వలన మిత్ర పురుగులు చనిపోతున్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రసాయనిక ఎరువుల ,పురుగుమందులవాడకం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఖాదర్‌వలి, వ్యవసాయ సహాయకులు వెంకటరమణనాయక్‌లు పాల్గొన్నారు.

## ఇలాంటి సమావేశాలకు ఇక రాను...



-సభ్యులు హాజరు కాకపోతే సమావేశాలెందుకు?

-మండల మీట్‌లో ఎమ్మెల్యే ఎంఎస్.బాబు

తవణంపల్లె, జనవరి 18 ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావే శాలకు సభ్యులు సక్రమంగా హాజరు కాకపోతే సమావేశాలు ఎందుకు నిర్వహించడమని ఇలాంటి సమావేశాలకు ఇక రానని ఇదే ఆఖరి సమావేశమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గీత అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంకు ఎమ్మెల్యే బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశానికి పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గైర్హాజరవడం, వారి స్థానంలో వారి కుటుంబసభ్యులు హాజరుకావడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికైన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు సభ్యులు హాజరు కానపుడు సమావేశాలు ఎందుకు నిర్వహించడమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సమావేశంలో ఆయా శాఖలకు సంభందించిన అభివృద్ధి అధికారులు సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ భారతి, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ ఎం.హరిప్రసాద్‌రెడ్డి, తహశీల్దార్ సుశీల, ఎంఈఓ శంకరయ్య, పీఆర్ ఏఈ గురువారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శంకర్, ఏఓ ప్రవీణ్, పశువైద్యాధికారి లావణ్య, మండల వైద్యాధికారి డాక్టర్ దాత్రేయ చౌదరిలతో పాటు ఎంపీటీసీలు,సర్పంచ్‌లు, ప ంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో వైభవంగా ఎన్టీఆర్ వర్ధంతి



కాణిపాకం, జనవరి 18 ప్రభాతవార్త:

మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత ఎన్టీఆర్ 27వ వర్ధంతిని కాణిపాకంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అగరంపల్లె కూడలిలో ఎన్టీఆర్ చిత్రపటాన్ని వుంచి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లారపల్లె గిరినాయుడు, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మండల నాయకులు మధుసూధన్‌నాయుడు, బాబునాయుడు, ధనంజయనాయుడు, నరసింహులునాయుడు, బాలకృష్ణ, పూర్ణచంద్రరావు, ఎన్టీఆర్ అభిమానుల సంఘం నాయకులు భూమా బాలకృష్ణలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

***తవణంపల్లెలో...***

తవణంపల్లె, జనవరి 18 ప్రభాతవార్త: దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతిని మండల కేంద్రం తవణంపల్లెలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు వెంకటేష్ చౌదరి, కోదండయ్య, మండల అధ్యక్షుడు గాలి దిలీప్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి జొన్నగురకల మధుకుమార్, మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, బిజి సెల్ అధ్యక్షుడు వినాయకం, నాయకులు శరవణ,జయపాల్, లవకుమార్, మునీంద్ర, వల్లేరు రాజేష్, భార్గవ్ చౌదరి, మిట్లపల్లె శ్రీధర్, మనోహర్‌నాయుడు, రెడ్డెప్పనాయుడు, శోభన్‌బాబు, మురళినాయుడులతో పాటు పలువురు నాయకులు,

## చెరువు వేలం పాట పాడి డబ్బులు కట్టని వైనం

- వనదుర్గాపురం పంచాయతీకి రూ.1.15 లక్షలు నష్టం

పాలసముద్రం, జనవరి 18 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలం వనదుర్గాపురం పంచాయతీ పరిధిలో చెరువు వేలం పాటల్లో పాల్గొని అత్యధిక మొత్తంకు వేలం పాట పాడిన వ్యక్తులు ఇప్పటి వరకు పంచాయతీకి డబ్బులు చెల్లించకపోవడంతో పంచాయతీ నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. వనదుర్గాపురం పంచాయతీ పరిధిలోని రెండు చెరువులను డిసెంబర్ 26వ తేదీన ఇఓఆర్డీ ఆధ్వర్యంలో వేలం వేశారు. ఈ రెండు చెరువుల్లో చేపలు పట్టుకోవడానికి ఇద్దరు వ్యక్తులు 1.68 లక్షల రూపాయలకు వేలం పాట పాడారు. ఈ వేలం డబ్బులు చెల్లించడానికి ఇఓఆర్డీ వారికి జనవరి 2వ తేదీ వరకు గడువు ఇచ్చారు. అయితే వనదుర్గాపురం పంచాయతీ పరిధిలోని పాత చెరువు వేలం ఎత్తిన వ్యక్తి 51 వేల రూపాయలు చెల్లించి చెరువులో చేపలు పట్టడానికి అనుమతి పొందాడు. అయితే రాజుగుంట చెరువు వేలం పొందిన వ్యక్తి 1.15 లక్షల రూపాయలను ఇప్పటి వరకు పంచాయతీకి చెల్లించని పరిస్థితి ఏర్పడింది. ఈ మేరకు అధికారులు వేలం పాట ఎత్తిన వారు డబ్బులు చెల్లించి చెరువు నిర్వహణను తీసుకోవాలని నోటీసులు జారీ చేశారు. అయితే ఈ నోటీసులకు వేలం ఎత్తిన వారి నుండి ఇప్పటి వరకు ఎలాంటి సమాధానం రాలేదు. ఈ విషయంపై జాతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుప్రసాద్ మాట్లాడుతూ రాజకుంట చెరువు వేలం పాట నిర్వహించి నెల రోజులు దాటినా వేలం ఎత్తిన వ్యక్తి పంచాయతీకి చెల్లించాల్సిన 1.15 లక్షలు చెల్లించకపోవడంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి వేలం పాడిన వారి నుండి పంచాయతీకి రావాల్సిన మొత్తంను కట్టించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుంటే నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తరపున అధికారులు లీగల్ నోటీసులు అందుకోవాల్సి వుంటుందని పేర్కొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి



పాలసముద్రం, జనవరి 18 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలం టివిఎన్‌ఆర్ పురంలో బుధవారం తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 27వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టివిఎస్‌ఆర్ పురం ఎంపిటీసీ జగన్నాధరాజు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజులు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబశివన్‌లు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు సోమశేఖర్, పార్లమెంటు ఎస్సీ సెల్ కార్యదర్శి బాలయ్య, దేశం నాయకులు ఆరుముగం, తిరుమలరాజు, సిద్దయ్యమండడి, మేఘనాథం, మురళీరాజు, వెంకటేష్‌రాజు, మునికేశవ్, టివిఎస్‌ఆర్ పురం దళిత దళం కెప్టెన్ వెంకటేష్, అయ్యప్ప, సుబ్రమణ్యం, శేఖర్, మురహరిరాజు, కెఎస్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకొని రక్తదానం



చిత్తూరు, జనవరి 18 ప్రభాతవార్త:

తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 27వ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు పులివర్తినాని, ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలత తదితరులు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో గుడిపాల మండల దేశం అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, మాజీ కార్పొరేటర్ కందా, ఇతర దేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేమన పద్యాలు దారిచూపే నేస్తాలు

పలమనేరు,జనవరి 18,ప్రభాతవార్త:

వేమన పద్యాలు దారి చూపే నేస్తాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసినాథంనాయుడు తెలిపారు. బుధవారం స్థానిక కళామందిరంలో వేమన జయంతిని పురస్కరించుకొని ముందస్తుగా విద్యార్థులకు వేమన పద్యపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన జీవిత సత్యాలను ఆటవెలదుల రూపంలో మనకు అందించారన్నారు. వానలో తడవని వారు వేమన పద్యంరాని తెలుగు వారు ఉండరన్న సామెత అతిశయోక్తి కాదన్నారు.పద్యాల పోటీకి వివిధ ప్రాంతాల నుంచి 70 మంది పిల్లలు హాజరయ్యారు.వీరిలో ఎక్కువ పద్యాలు చెప్పిన జైవర్ధన్,సాయిధ్యాన్‌చంద్,మానస,నేహ,చరిష్మబాను,సాత్విక,వర్షిణి తదితరులకు బహుమతులుఅందించారు.శివశంకర్‌రెడ్డి,చంద్రశేఖరయ్య, గిరిధరమూర్తి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కాషాయంకట్టి కాంగ్రెస్ పార్టీని కట్టడిచేసిన ధీరుడు ఎన్టీఆర్

-అబ్బూరి తాతయ్య నాయుడు

పలమనేరు,జనవరి 18,ప్రభాతవార్త:

కాషాయం కట్టి కాంగ్రెస్ పార్టీని కట్టడి చేసిన ధీరుడు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అని భారతీయజనతా పార్టీ పట్టణ అధ్యక్షులు అబ్బూరి తాతయ్య నాయుడు అన్నారు.బుధవారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982లో ఎన్టీఆర్ రాజకీయ పార్టీని స్థాపించి కేవలం 9నెలల కాలంలోనే రవిఅస్తమించని కాంగ్రెస్ పార్టీని మట్టికరిపించి ముఖ్యమంత్రి పీఠాన్ని అదిరోహించారని తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం - ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



బంగారుపాళ్యం, జనవరి 18 ప్రభాతవార్త:

పేద ప్రజల సంక్షేమమే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. బుధవారం తుంపాయనపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను ఎమ్మెల్యే నిర్వహించారు. ప్రతి ఇంటికి ఎమ్మెల్యే వెళ్తూ సిఎం జగన్ చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు. స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ఆయన తనయుడు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పూర్తిస్థాయిలో కొనసాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపిపి అమరావతమ్మ, జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి, తహసిల్దారు బెన్నురాజ్, వైకాపా నాయకులు ప్రవీన్‌రెడ్డి, మార్కొండేయులు, దొరస్వామి, నాగరాజు, జగదీష్, మహేంద్ర, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో క్షేత్ర స్థాయిలోనే వైద్య సేవలు

యాదమరి, జనవరి 18 ప్రభాతవార్త:

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో పల్లె ప్రజలకు క్షేత్ర స్థాయిలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం పూనుకొందని యాదమరి పిహెచ్‌సి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ పేర్కొన్నారు. యాదమరి పిహెచ్‌సి పరిధిలోని మోర్దానపల్లి గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను వైద్యాధికారులు, సిబ్బంది అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ ప్రతి నెలా సచివాలయ పరిధిలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వైద్యం, ఇతర పరీక్షలు అవసరమైన వారు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వాహనం వున్న ప్రాంతానికి వచ్చి వైద్యం, పరీక్షలు నిర్వహించుకోవచ్చునన్నారు. సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చిన్న జబ్బులకు క్షేత్ర స్థాయిలోనే వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు.ఎంఎల్‌హెచ్‌పి విష్ణుప్రియ, మహిళా ఆరోగ్య కార్యకర్త విమల, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్‌కు ఘన నివాళి

చిత్తూరు, జనవరి 18 ప్రభాతవార్త:

తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 27వ వర్ధంతిని బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు చిత్తూరు రూరల్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్‌కు ఘన నివాళి

గుడిపాల, జనవరి 18 ప్రభాతవార్త:

మండల కేంద్రం గుడిపాలలో బుధవారం తెలుగుదేశం నాయకులు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ సిఎం ఎన్టీఆర్ 27వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గుడిపాల మండల దేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి మండల దేశం అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల దేశం ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీటర్, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, యువత అధ్యక్షుడు శంకర్‌చౌదరి, నాయకులు కిట్టు తదితరులు పాల్గొన్నారు.

## వన్నెకుల క్షత్రియ జెండా ఆవిష్కరణ

గుడిపాల, జనవరి 18 ప్రభాతవార్త:

మండలంలోని పాపసముద్రం పంచాయతీ అడవిచేను గ్రామంలో వన్నెకుల క్షత్రియ నాయకుడు వీరప్పన్ జన్మదినం పురస్కరించుకొని సర్పంచ్ చిట్టిబాబు, ఆ కులం నాయకులు బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిట్టిబాబు వన్నెకుల క్షత్రియ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అలాగే వీరప్పన్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంఘ నాయకులు, యూత్, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సంక్షేమ ఫథకాల సృష్టికర్త ఎన్టీఆర్ : చల్లాబాబు



చౌడేపల్లి, జనవరి 18 ప్రభాతవార్త

సంక్షేమ పథకాల సృష్టికర్తగా ఎన్టీఆర్ చరిత్రకెక్కారన్నాని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) అన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 27వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక బస్టాండునందు ఘనంగా నివాళులర్పించారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేసారు. పార్లమెంట్ బిసిసెల్ అధికార ప్రతినిధి వెంకట్రమణ, యువత ప్రతినిధి కళ్యాణ్, మండల కార్యదర్శి శ్రీనివాసులునాయుడు, యువత అధ్యక్షుడు హరీష్‌రాయల్, నాయకులు పవన్, బాబు, చెంగల్రాయుడు, ఆది, రెడ్డి, గణేష్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## యుగపురుషుడు ఎన్టీఆర్..!

తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్

రాబోయే ఎన్నికల్లో టిడిపి ఘన విజయానికి ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

మండల టిడిపి కన్వీనర్ విజయ్ కుమార్ నాయుడు



ఓజిలి, జనవరి 18, ప్రభాతవార్త

తెలుగుజాతికి, తెలుగు భాషకు దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్ అని, స్త్రీలకు ఆస్తిలో వాటా ఉండాలని చట్టం తెచ్చిన ఘనత రామారావుదేనని గుర్తు చేశారు. బలహీన వర్గాలకు లక్షలాదిగా ఇళ్ళు కట్టించిన గొప్పతనం ఆయనకే దక్కిందన్నారు. అలాంటి మహనీయుని ఆశయాలకు అంతా కృషి చేయాలని కోరారు. తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని ప్రపంచం నలు దిక్కులా చాటిన మహోన్నతమైన వ్యక్తి, నట యుగపురుషుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు అని టిడిపి మండల కన్వీనర్ విజయ్ కుమార్ నాయుడు అన్నారు. బుధవారం ఓజిలి మండల కేంద్రమైన ఓజిలి బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ 27వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తెలుగు దేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ సేవలను గుర్తు చేసుకున్నారు. మహానాయకుడు అడుగుజాడల్లో ప్రజల కోసం నిరంతరం పని చేస్తామని టిడిపి అధినేత విజయ్ కుమార్ నాయుడు చెప్పారు. మహానాయకుడు ఎన్టీఆర్ అగుడుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని అన్నారు. తెలుగు దేశం పార్టీ కథానాయకునిగా మహా నాయకునిగా వెలిగిన ఎన్టీఆర్ 27వ వర్ధంతి సందర్భంగా ఆ మహానుభావుని స్మృతికి నివాళులు అర్పిస్తున్నామన్నారు. మళ్లీ చంద్రబాబు నాయకత్వంలో 2024 ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ ఘన విజయానికి ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులుపాడివెంకటసుబ్బయ్య,షేక్‌ఖలీల్,డిసిరెడ్డి,సుబ్రమణ్యంరాజు,కార్తీక్‌రాజు,షేక్ అల్లాబక్ష, మధుశేఖర్‌రాజు, జయరామరాజు, శ్రీనివాసులు, భానురాజు, సుబ్బరాయల రాజు, శ్రీనివాసులు రెడ్డి,జై చంద్ర రెడ్డి,నాగయ్య,కలింగరాజు,ఎన్టీఆర్‌అభిమానులు,బాలకృష్ణ,జూనియర్‌ఎన్టీఆర్‌అభిమానులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్‌కు నివాళులు



కోట, జనవరి 18 ప్రభాతవార్త

తెదేపా వ్యవస్థాపకులు, దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని కోటలో బుధవారం ఆపార్టీ నాయకులు నిర్వహించారు. స్దానిక ఆర్టీసీ బస్డాండు వద్ద ఎన్టీరామారావు చిత్ర పటానికి నివాళుర్పిం చారు. ఈ సందర్భంగా మండల తెదేపా కన్వీనర్ ఎం.సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.ముఖ్యమంత్రిగా రామారావు ప్రజారంజాక పాలన అందించి ప్రజల హృదయాల్లో చిరస్దాయిగా నిలిచిపోయారని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమయంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## టిడిపి అధికారంలోకి రావాలంటే యువత ముందుండాలి

టిడిపి యువ నాయకుడు కంకణాల వరప్రసాద్ నాయుడు

ఓజిలి, జనవరి 18, ప్రభాతవార్త

యువత, మహిళలు, కార్యకర్తలు, నాయకులు ముందు ఉంటే అధికారం టిడిపీదే అని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలంటే యువత ముందుండాలని తెలుగు దేశం పార్టీ యువ నాయకులు కంకణాల వరప్రసాద్ నాయుడు అన్నారు. బుధవారం ఆయన వార్త దినపత్రికతో మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చేందుకు మండల స్థాయి నుంచి, గ్రామ స్థాయి వరకు యువకులు ముందుకు రావాలన్నారు. ప్రతి 50 కుటుంబాలకు ముగ్గురు లేక నలుగురు యువకులు బాధ్యత తీసుకోవాలన్నారు. యువతీ, యువకులకు ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిఎం జగన్ మడమతిప్పడంతో యువతీ, యువకులు తెలుగుదేశం వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. వైసిపి అధికారం చేపట్టిన మూడున్నర సంవత్సరాలైనా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో సర్వే పేరుతో పింఛన్లను తొలగించడం అన్యాయమన్నారు. రాబోయే ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ గెలుపు కోసం కలిసికట్టుగా పని చేసి ఓజిలి మండలంలో టిడిపి జెండా ఎగురేయాలి అన్నారు. పార్టీకి మళ్లీ పూర్వ వైభవం తేవాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన సూచించారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ఓజిలి, జనవరి 18, ప్రభాతవార్త

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన ఓజిలి మండలంలోని గొల్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఓజిలి పోలీసులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం ముమ్మడి దినేష్ (14) గొల్లపల్లి గ్రామంలో మోటార్ విద్యుత్ కనెక్షన్ ఇస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై చనిపోయినట్లుగా ఓజిలి పోలీసులు తెలిపారు. ఫిర్యాదు ఇచ్చిన ముమ్మడి భాస్కర్ కర్ర బల్లవోలు గ్రామానికి చెందిన వారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓజిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీసు కుటుంబాలల్లో గేట్ టు గెదర్

కోట,జనవరి 18 ప్రభాతవార్త

విధి నిర్వహాణలో ఏంతో ఒత్తిళ్లతో సతమతవుతున్న పోలీసులకు కాస్తా ఊరట లభించింది. కుటుంభ సభ్యులతో కాస్తా ప్రశాంతగా గడిపారు. బుధవారం రాత్రి వాకాడు సిఐ హరికృష్ణ ఆధ్వర్యంలో స్దానిక షాదిమంజిల్‌లో కోట,వాకాడు, చిట్టమూరు మండలాల్లో పోలీసుల తమ కుటుంభ సభ్యులతో ఆప్యాయంగా కలుసుకుని గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని నిర్వహించుకొని కాస్త ఆనందంగా గడిపారు. పోలీసులంతా ఒకే చోటకు చేరడంతో వారిలో ఒకరి అభిప్రాయాలను మరో ఒకరు షేర్‌చేసుకుని ఉల్లసంగా గడిపారు.ఈ కార్యక్రమంలో కోట, ఎస్.ఐ.జి.పుల్లారావు.వాకాడు ఎస్ఐ.రఘునాద్, చిట్టమూరు ఎస్ఐ.గోపి,ఆయాపోలీస్‌సేష్టన్లుఎ.ఎస్ఐలు,హెడ్‌కానిస్టేబుళ్లు, పోలీసులు,మహిళాపోలీసులు పాల్గొన్నారు.

## సంక్షేమమే అభివృద్ధిగా పనిచేస్తున్న సిఎం జగన్



చిల్లకూరు జనవరి 18 ప్రభాతవార్త

సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పనిచేస్తున్నగూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని వరగలి గ్రామ పంచాయితీలో నాయకులతో కలిసి గడగడపకు మనప్రబుత్వకార్యక్రమంనిర్వహించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతు కోలగట్ల గ్రామ పంచాయితీలో 6 వందల కుటుంబాలు సంక్షేమపథకాలు పొందినారని రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను పంపీణి చేస్తు వారి సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగిందని అన్నారు.ముఖ్యంగా త్రాగునీటికోసం మరో అదనపు వాటర్ ట్యాంకు కావాలని,సిపిరోడ్లు,డ్రైనేజి కావాలని వరగలి గ్రామానికి చెందిన సీనియర్‌నాయకులు మాజీ ఎఎంసి ఛైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని రావడం జరిగింది.ఈకార్యక్రమంలో మండల ఉపాధ్యాక్షులు వేమారెడ్డి కుమారస్వామి రెడ్డి,జడ్పిటిసి మన్నెం శ్రీనయ్య, ఎంపిడిఓ విష్ణు చిరంజీవి, సిఐ దశరధరామారావు,ఏఇ మునిరత్నం, ఎంపిటిసిలు దార్లకోటేశ్వరరావు,ఎల్లసిరి జానకిరామ్,సర్పంచ్ బండి మాధవి, వైసిపి నాయకులు వబ్బాయి శివకుమార్,మల్లికార్జున్,శశి,నెల్లిపూడి సుబ్రమణ్యం,పంచాయితీ కార్యదర్శి పద్మజా, సచివాలయ సిబ్బంది,వాలింటర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో ఘనంగా ఎన్టీఆర్ 27వ వర్ధంతి వేడుకలు

తెలుగు రాష్ట్రాలకు ఎన్టీఆర్ చేసిన సేవలు ఎనలేనివి,

మాజీ ఎమ్మెల్యే డా. పాశం సునీల్ కుమార్



గూడూరు, జనవరి 18, ప్రభాతవార్త

మాజీ మంత్రి దివంగత నేత నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి వేడుకలు గూడూరు నియోజకవర్గ పరిధిలో పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా గూడూరు పట్టణంలోని గమళ్లపాళెంలో ఉన్న టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు టిడిపి ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, టిడిపి మహిళ నాయకురాలు మట్టం శ్రావణి, గూడూరు పట్టణ, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు తాతపూడి, ఇశ్రాయల్ కుమార్, నాయకులు దువ్వూరురవీంద్రారెడ్డి,పిల్లెలశ్రీనివాసులు,అలీహుస్సేన్,ఏసుపాకపెంచలయ్య, బట్టెపాటి వెంకటకృష్ణయ్య, పిపెళ్ళ అమరయ్యనాయుడు, రావుల శివప్రసాద్ గౌడ్, బెల్లంకొండ రాజేంద్ర, ప్రసాద్, యువత బత్తిన ప్రణీత్ యాదవ్, నెలటూరు చిరంజీవి, యనమల దినేష్, వేములు సునీల్, గుండాల సందీప్, పురిణి దయాకర్, మల్లి కళ్యాణ్, అల్లం వెంకటసాయి, టిఎన్ఎస్ఎఫ్ సభ్యులు ఆసనాపురం వెంకటేష్, పచ్చవ గౌతమ్ నాయుడు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుజాతి కీర్తిపతాక ఎన్టీఆర్



- తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం

కుప్పంరూరల్, జనవరి 18 ప్రభాతవార్త

తెలుగుజాతి కీర్తిపతాక దివంగత ఎన్టీఆర్ అని టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, రాష్ట్ర నేత గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం దివంగత ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా కుప్పంలో ఎన్టీఆర్ విగ్రహానికి దేశం నేతలు పూజలు నిర్వహించారు.చలనచిత్ర నటుడిగా ప్రస్థానం ఆరంభించి టిడిపి స్థాపించి అనతికాలంలోనే ముఖ్యమంత్రి అయిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. కార్యక్రమాల్లో నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, త్రిలోక్, మంజునాథ్, ఆర్‌ఆర్ రవి, డికెపల్లి మణి, తెలుగుయువత అధ్యక్షుడు మణి, మురళి, బుజ్జి,చలపతి, మురుగేష్, బగ్గిడి వెంకటేష్, సంజీవరాజులు నాయుడు, వల్లెప్ప తదితరులు పాల్గొన్నారు.

***ద్రవిడ వర్సిటీలో :*** దివంగత ఎన్టీఆర్ వర్ధంతిని ద్రవిడ వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. వర్సిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశం నేత యశ్వంత్‌చే పెద్ద ఎత్తున అన్నదానం

కుప్పంరూరల్, జనవరి 18 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ కుప్పం వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు యశ్వంత్ బుధవారం కుప్పంలో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. తన కుమార్తె పుట్టిన రోజు, ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద సుమారు 900మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, రాజ్‌కుమార్, పిఎస్ సతీష్, ఆర్‌ఆర్ రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

శాంతిపురం, జనవరి 18 ప్రభాతవార్త



మాజీ సిఎం దివంగత ఎన్టీఆర్ వర్ధంతిని శాంతిపురంలో దేశం నేతలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహంకు పూజలు చేసి నివాళులు అర్పించారు. అనంతరం నేతలు మాట్లాడుతూ ఎన్టీఆర్ రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నాగరాజు, జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, చంద్ర, ఉయ్యాల జయరామరెడ్డి, గోపాల్, మంజునాథ్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి, రమేష్, నారాయణస్వామి, పెద్దన్న, బాలు, రమేష్ రెడ్డి, మునెప్ప, అనసూయ, చంద్రకళ, మణి, బసవరాజు, సుగుణమ్మ, రూప తదితరులు పాల్గొన్నారు.

## ఎం.పి.మిథున్‌రెడ్డికి అడుగడుగునా ఘనస్వాగతం



కుప్పం, జనవరి 18 ప్రభాతవార్త

రాజంపేట ఎం.పి. మిథున్‌రెడ్డి కుప్పం పర్యటన సందర్భంగా వైకాపా శ్రేణులు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. బైరెడ్డిపల్లిలో రాష్ట్ర నేత కృష్ణమూర్తి, డిసిసిబి ఛైర్మన్ రెడ్డెమ్మ, ఎంపిపి రెడ్డెప్పలు ఘనస్వాగతం పలికారు. వి.కోటలో జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ స్వాగతం పలికారు. కుప్పంలో ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెస్కోఛైర్మన్ సెంధిల్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసా గర్, స్థానిక నేతలు ఎంపికి ఘనస్వాగతం పలికారు. మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ కుప్పంకు సిఎం ప్రత్యేకంగాకేటాయించిన66కోట్లతోజరుగుతున్నఅభివృద్ధిపనులగురించి ఎం.పి. మిథున్‌రెడ్డికి వివరించారు.

## పెద్దిరెడ్డి కుప్పంలో పోటీకి సిద్ధమేనా - తెదేపా నేతలు



రామకుప్పం, జనవరి 18 ప్రభాతవార్త

కుప్పంలో మాజీ సిఎం చంద్రబాబునాయుడుపై పోటీ చేసేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సిద్ధమేనా అని తెదేపా నేతలు ప్రశ్నించారు.బుధవారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు చేశారు. స్థానిక పిహెచ్‌సిలో రోగులకు పళ్ళు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కుప్పంలో చంద్రబాబును ఓడిస్తామని పదేపదే చెప్పడం కాదు కుప్పంలో ఆయనపై పోటీ చేసి గెలవాలన్నారు. కుప్పంలో వైకాపా ప్రభుత్వ పాలనలో అరాచకాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, ఆంజయరెడ్డి, గంట్లగౌడు, రామకృష్ణ, జయశంకర్, రఫీ, నరసింహులు, విశ్వనాథ్, చంద్రశేఖర్‌రెడ్డి, రామలింగారెడ్డి, చలపతి, చిన్నికృష్ణ పాల్గొన్నారు.

## యుగ పురుషుడు ఎన్టీఆర్

బంగారుపాళ్యం, జనవరి 18 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి సర్గీయ ఎన్టీఆర్ యుగ పురుషుడని మండల టిడిపి అధ్యక్షుడు జయప్రకాష్ అన్నారు. బుధవారం 27వ ఎన్టీఆర్ వర్ధంతిని బంగారుపాళ్యంలో టిడిపి నాయకులు నిర్వహించారు, నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎన్టీర్ చిత్రపటానికి పూజలు నిర్వహించి నివాళులు అర్పించారు. అనంతరం శేషాపురంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూజలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని రోగులకు పాలు, పండ్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోకా ప్రకాష్‌నాయుడు, జనార్ధన్‌గౌడు, కమలనాధరెడ్డి, జయచంద్రనాయుడు, బుస్సానాగరాజు, ఎక్కిలి భాస్కర్, వంశీకృష్ణ, రాధాకృష్ణ, రమేష్, మంజునాథ్, రాజేంద్రనాయుడు, శివ తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా పోలీసు రాత పరీక్షలు

**- అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జగదీష్**




చిత్తూరు, జనవరి 18 ప్రభాతవార్త:
కానిస్టేబుల్ నియామక ప్రిలిమినరీ రాత పరీక్షలను పక్కాగా నిర్వహించాలని అడ్మిన్ అడిషనల్ డిఎస్పీ జగదీష్ ఆదేశించారు. ఈ నెల 22న జరుగనున్న కానిస్టేబుల్ నియామక ప్రిలిమినరీ రాత పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం అడ్మిన్ అడిషనల్ ఎస్పి జగదీష్ పివికెఎన్ డిగ్రీ కళాశాలలో పరీక్షల సూపరిటెండెంట్లు, పివికెఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆనంద్‌లతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో అడ్మిన్ ఎఎస్పీ జగదీష్ మాట్లాడుతూ కానిస్టేబుల్, ఎస్ఐ రాత పరీక్షల కోసం జిల్లాలో 33 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంకు ఎస్ఐ నుండి డిఎస్పీ స్థాయి అధికారి వరకు ఇన్‌ఛార్జీ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారన్నారు. పరీక్షల నిర్వహణ కోసం పక్కా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలన్నారు. అలాగే పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 6,100 కానిస్టేబుల్, 411 సబ్ ఇన్స్పెక్టర్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ రిక్రూట్‌మెంట్లను ఎపి స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించనుందన్నారు. ఈ సమావేశంలో ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ



నగరి, జనవరి 18 ప్రభాతవార్త:
మండలంలోని మూలనత్తం గ్రామంలో నిర్మించనున్న డ్రైనేజీకి మంత్రి రోజా భూమిపూజ చేశారు. బుధవారం గ్రామానికి విచ్చేసిన ఆమె రూ.20 లక్షల వ్యయంతో నిర్మించే డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తూ భూమిపూజ చేశారు. త్వరలో డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నయ్యప్ప, వెంకటలక్ష్మి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సతీష్‌కుమార్, నాయకులు భాస్కర్‌రెడ్డి, జయరామ్, ఏసు, పరందామన్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి యువకుడు మృతి

చిల్లకూరు జనవరి 18 ప్రభాతవార్త
మండలంలోని ముత్యాలపాడు గ్రామ పంచాయితీలో అరుంధీయవాడకు చెందిన ఆత్మకూరు ప్రసాద్ (29) అనే యువకుడు చెరువులో పడి మృతి చెందాడు.స్దానికుల వివరాలు మేరకు గత మూడు రోజుల నుండి ఊరిలో కనిపించికుండా పోవడం జరిగిందని బుధవారం ఉదయం గ్రామ సమీపంలో ఉన్న చెరువు వద్ద తూము వద్ద అతని బండి గమనించిన స్దానికులు పరిశీలించగా నీటిలో మునిగి మృతి చెందడం గమనించారు.ఈవిషయాన్ని చిల్లకూరు ఎస్ఐ బి .గోపాల్‌కి సమాచారం అందించడంతో మృతదేహాన్ని నీటిలో నుండి బయటకు తీసి కేసు నమోదు చేసి మృతికి గలకారణాలు తెలుసుకుంటున్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం

**- ఇకపై రోజు సాయంత్రాల్లో రోడ్లపైకి పోలీసులు**

చిత్తూరు, జనవరి 18 ప్రభాతవార్త:
చిత్తూరు నగర పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను పోలీసులు కఠినతరం చేశారు. జిల్లాలో బుధవారం నుండి రోడ్డు భద్రతా వారోత్సవాలు ప్రారంభం కానుండంతో ఈ వారం రోజుల పాటు పోలీసులు ప్రతి రోజు సాయంత్రం 7 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు రోడ్లపై వుండి రహదారి భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయనున్నారు. ఈ సందర్భంగా ద్విచక్రవాహనాలతో పాటు బస్సులు, లారీలు, ఇతర వాహనాల డ్రైవర్లకు డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు తేలితే వాహనాలను సీజ్ చేసి కోర్టుకు తరలించనున్నారు.

## తిరుమలకుప్పంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు



**సిమెంటు బస్తాలు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా**

పుత్తూరురూరల్, జనవరి 18 ప్రభాతవార్త:
మండలంలోని తిరుమలకుప్పం గ్రామంలో మంత్రి రోజా అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. బుధవారం తిరుమలకుప్పం సచివాలయ పరిధిలో గడప గడప మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలు, ఎమ్మెల్యే నిధులు రూ.10 లక్షలతో చేపట్టే డ్రైనేజీ, సిమెంటు రోడ్లు, పైపులైన్ పనులకు భూమిపూజ చేశారు. దిగువ తిరుమలకుప్పం దళితవాడలో పూత పని చేయకుండా నిలిచిపోయిన పక్కా గృహాలకు రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సిమెంటు బస్తాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, పుత్తూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌యాదవ్, సర్పంచ్ సరస, గోవిందస్వామిరెడ్డి, నాయకులు షణ్ముగం, ఉదయ్, దేవేంద్ర, నరసింహ, శ్యామ్, దాసు, ఏసు, గోపి తదితరులు పాల్గొన్నారు.

## మార్చిలోగా హౌసింగ్ లక్ష్యాలు పూర్తి

**- మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ**

చిత్తూరు, జనవరి 18 ప్రభాతవార్త:



మార్చి 22వ తేదీనాటికి జగనన్న హౌసింగ్ కాలనీల్లో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై బుధవారం కమీషనర్ డాక్టర్ జె.అరుణ మున్సిపల్ కార్యాలయంలో హౌసింగ్, మెప్మా అధికారులు, సిఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమీషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలోని లేఅవుట్లలో ప్రస్తుతం 1,273 ఇళ్ళ నిర్మాణాలు వివిధ దశల్లో జరుగుతున్నాయన్నారు. ఈ నిర్మాణాలను మార్చి నాటికి పూర్తి అయ్యేలా ప్రణాళిక రచించి అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఎఇ శ్రీధర్, మెప్మా సిఎంఎం గోపి, సిఓలు పాల్గొన్నారు.

## జెన్ అకాడమి క్యాలెండర్ ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి



తిరుపతి (క్రీడ), జనవరి 18, ప్రభాతవార్త
ఆంధ్రప్రదేశ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి వారి స్వగృహం నందు జెన్ అకాడమి నూతన సంవత్సరం క్యాలెండర్ వైఎస్ఆర్‌సిపి జిడి నెల్లూరు నాయకులు జెన్ అకాడమి అధ్యక్షులు రాజేష్, ఉపాధ్యక్షులు భాను ప్రకాష్ రెడ్డి, కార్యదర్శి కిరణ్ కుమార్, చీనేపల్లిలు ఆవిష్కరించారు. జెన్ అకాడమి క్రీడలకు చేస్తున్న సేవలను మిథున్ రెడ్డిని అభినందించి క్రీడలకు తన వంతు సహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.

# ఎన్టీఆర్ ఆశయాలకోసం టిడిపిని గెలిపించుకుందాం

## వర్ధంతి వేడుకల్లో తెలుగుదేశం శ్రేణులు



తిరుపతి,జనవరి 18ప్రభాతవార్త:
పేదబడుగుబలహీనవర్గాల సంక్షేమం కోసం స్థాపించిన తెలుగుదేశంపార్టీ అజెండాను, వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఆశయాల సాధనకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని టిడిపి ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ వర్ధంతిసందర్భంగా బుధవారం తిరుపతిలోని టౌన్‌క్లబ్ కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగుదేశం నాయకులు బి.శ్రీధర్‌వర్మ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించి ,తెలుగుయువత, పార్టీ నాయకులు రక్తదానం చేశారు. ఇక్కడే పేదలకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు నియోజకవర్గ పరిశీలకుడు వి.సురేంద్రకుమార్, నరసింహయాదవ్, ఆర్‌సి మునికృష్ణ, వట్టికుంట చినబాబు, ఊట్లసురేంద్రనాయుడు, కంకణాల రజినీకాంత్‌నాయుడు, బుల్లెట్‌రమణ, మబ్బుదేవనారాయణరెడ్డి, దంపూరి భాస్కర్, మహేష్‌యాదవ్, మునిశేఖర్‌రాయల్, రవి తదితరులు పాల్గొన్నారు.

## 21న మహాశివరాత్రి సమన్వయ సమావేశం

శ్రీకాళహస్తి, జనవరి 18 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఈ నెల 21న నిర్వహించనున్నట్లు ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారకశ్రీనివాసులు బుధవారం తెలిపారు.సమావేశం దేవస్థానం పరిపాలనా భవనంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ ఏడాది గతం కన్నా భిన్నంగా,ఘనంగా నిర్వహించుటకు స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి పలు సూచనలు చేసారన్నారు.ఆయన ఆదేశాల మేరకు ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికపై జరుగుతున్నాయని శ్రీనివాసులు వివరించారు.ఇప్పటికేశి వరాత్రిబ్రహ్మోత్సవాలకు సంబంధించిన పనులను ఇంజనీరింగ్ విభాగం యుద్ధ ప్రాతిపదికపై చక చకా చేస్తున్నారన్నారు. ఈ ఏడాది శివరాత్రికి గతం కన్నా భక్తులు అత్యధికంగా హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు వచ్చిన భక్తులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా వచ్చిన భక్తులకు సత్వర, సుదర్శనం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు.ఈ ఏడాది మహాశివరాత్రి పర్వదినాన స్వామి దివ్యసన్నిధిలో భక్తులకు సుదర్శనం, సత్వర దర్శనం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.ఈ మేరకు గతానుభవాలతో ఇంజనీరింగ్ అధికారులు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇక శివరాత్రి పర్వదినాన ఆలయంలో స్వామి అమ్మవార్ల దర్శనాలు, లింగోద్భవ అభిషేకాలు, దర్శనాలకు సంబంధించి ఎలాంటి ఇబ్బంది లేకుండా సామాన్య భక్తులకు సైతం లింగోద్భవ అభిషేక దర్శనం కల్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని శ్రీనివాసులు వివరించారు.

## శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, జనవరి 18 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి బుధవారం తైలాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మకరరాశి నుంచి కుంభరాశిలోకి శనీశ్వరస్వామి ప్రవేశించిన సందర్భంగా ఆలయంలోని శనీశ్వరస్వామికి నూనె, పాలు, పెరుగు, తేనె, పంచామృతం, విభూది, నారికేళజలాలు, కుంకుమ, మరియు కళశజలాలతో ప్రత్యేకంగా తైలాభిషేకాన్ని అర్చకులు రామకృష్ణశర్మ సారధ్యంలోనిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరుతారకశ్రీనివాసులు, ఎంఎల్ఏ సతీమణి బియ్యపుశ్రీవాణిరెడ్డి, మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా సుబ్రమణ్యస్వామి హోమం

తిరుపతి,జనవరి 18ప్రభాతవార్త:



కపిలేశ్వర ఆలయంలో హోమ మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సుబ్రమణ్య స్వామి హోమం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఓ దేవేంద్రబాబు, టిటిడి ఛైర్మన్ సతీమణి స్వర్ణలతరెడ్డి, ఆలయ ఎఇఓ పార్ధసారధి, అర్చకులు పాల్గొన్నారు. నేడు ఆలయంలో దక్షిణామూర్తి హోమం జరగనుంది.

## ప్రపంచమే గర్వించదగిన మహానటుడు ఎన్టీఆర్

తిరుపతి,జనవరి 18ప్రభాతవార్త:




సినీరంగంలో మహానటుడుగా, రాజకీయాల్లో మార్పుతెచ్చిన మహానుభావుడు ఎన్టీఆర్ అని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి కొనియాడారు. పౌరా ణిక, జానపద ,సాంఘికచిత్రాల్లో కథానాయ కుడుగా ఆయనకు ఆయనే సాటిఅని ఎన్టీఆర్‌ను పేర్కొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సంద ర్భంగా బుధవారం తిరుపతిలోని రాయలసీమ రంగస్థలి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు.

## నిరుపేదలకు సిమెంటు బస్తాల వితరణ

వడమాలపేట, జనవరి 18 ప్రభాతవార్త:
మండలంలోని ఏఎం పురం, నారాయణపురం పంచాయతీ పరిధిలోని నిరుపేదలకు మంత్రి రోజా సిమెంటు బస్తాలు బుధవారం వితరణగా అందజేశారు. రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా 25 మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 700 సిమెంటు బస్తాలను అందజేశారు. కాలనీలో ఇళ్లు పాడైనవారు, అసంపూర్తిగా ఇళ్లు ఉన్న వారు పూర్తి చేసుకోవడానికి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, మాజీ జడ్పీటీసీ సభ్యులు సురేష్‌రాజు, నాయకులు వెంకటేష్, ధర్మయ్యయాదవ్, ఉమాపతి, బాల, సుధీర్‌రెడ్డి, శేఖర్, మునిబాబు, వెంకటరెడ్డి, రమేష్‌రాజు, సుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్‌తో ప్రతి ఒక్కరికి పునర్‌జన్మ

**- కలెక్టర్ హరినారాయణన్**



చిత్తూరు, జనవరి 18 ప్రభాతవార్త:
అమ్మ జన్మనిస్తే హెల్మెట్ పునర్‌జన్మ ఇస్తోందని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ వినియోగించాలని దీని ద్వారా ప్రమాద సమయంలో తలకు దెబ్బ తగులకుండా, మరణాలు సంభవించకుండా ఆపగలమని కలెక్టర్ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ హరినారాయణన్ బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బుధవారం నుండి ఈ నెల 24వ తేదీ వరకు 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు జరుగనున్నాయని, రహదారి భద్రత జీవితానికి భద్రత అని పేర్కొన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ అధికారులు కళాశాలలకు వెళ్ళి విద్యార్థులకు హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే అతి వేగంతో వాహనాలు నడుపడం వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు సాయంత్రం 7 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు టాక్సీ, బస్సు, లారీ వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లను నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడుపరాదని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి వాహనంకు రేడియం స్టిక్కర్‌ను అతికించాలన్నారు. అలాగే ముఖ్య రోడ్ల కూడళ్ళ వద్ద ప్రమాదాలు జరుగకుండా ఏర్పాటు చేసిన బ్యానర్లను తొలగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. డిటిసి బసిరెడ్డి మాట్లాడుతూ నాసిరకం హెల్మెట్లు వాడకం వల్ల ప్రయోజనం వుండదని, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రకారం ఐఎస్4151 ఉన్నదే వాడాలన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సురక్షిత ప్రయాణంకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులు, వాహనదారులకు అవగాహన పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండిఐలు వాసుదేవరెడ్డి, మధుసూధన్, మురళి, సంబంధిత శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## "శుభస్యశీఘ్రం"తో సరికొత్త సాయంత్రం




తిరుపతి,జనవరి 18ప్రభాతవార్త:
ఎప్పటికప్పుడు ప్రేక్షకులు నచ్చే,ఆదరించే రీతిలో అలరిస్తున్న జీతెలుగు ఛానల్ కొత్త సంవత్సరంలో కొత్తదనం నిండిన కామెడీ, డ్యాన్స్, సింగింగ్ షోలు, ఆసక్తికర మలుపులతో సాగుతున్న సీరియల్స్‌తో బాటు కొత్తగా "శుభస్య శీఘ్రం" కొత్త సీరియల్ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఆర్థిక అసమానతలు, ఆత్మాభిమానం మధ్య జరిగే సంఘర్షణగా తెరకెక్కుతున్న ప్రేమకథ. మహేష్‌బాబు, కృష్ణప్రియ ప్రధాన పాత్రలలో నటించిన శుభస్యశీఘ్రం ఈనెల 23వతేదీ నుంచి రాత్రి 7గంటలకు జీతెలుగులో ప్రసారం కానుందని ప్రతినిధి ప్రసాద్ తెలిపారు. ఒక మధ్యతరగతి తల్లికి అండగా ఉండి, కూతురు కుటుంబాన్ని ఆపదల నుండి ఎలాకాపాడుకుందనే ఆసక్తికర కథాంశంతో సీరియల్ తెరకెక్కిందన్నారు. ప్రేక్షకులను ఎంతగానోఅలరించనుందన్నారు.

## చిత్తూరు హోటళ్ళపై కమిషనర్ ఆగ్రహం

**- కుళ్ళిన స్థితిలో రొయ్యలు, మాంసం**
**- హోటల్ ఎన్‌పిఎస్ భాస్కరా సీజ్**
**- విష్ణుభవన్ హోటల్‌కు నోటీసులు జారీ**

చిత్తూరు, జనవరి 18 ప్రభాతవార్త:
చిత్తూరు నగర పరిధిలోని పలు హోటళ్ళపై మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఉగ్రరూపం దాల్చారు. ఎన్‌పిఎస్ భాస్కరా, విష్ణుభవన్ హోటళ్ళల్లో బుధవారం అకస్మిక తనిఖీలు నిర్వహించిన కమీషనర్ డాక్టర్ జె.అరుణ హోటల్ ఎన్‌పిఎస్ భాస్కరాను సీజ్ చేయగా విష్ణుభవన్ హోటల్‌కు నోటీసులు జారీ చేశారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ బుధవారం నగరంలోని హోటళ్ళల్లో అకస్మిక తనిఖీలు నిర్వహించగా హోటల్ ఎన్‌పిఎస్ భాస్కరాకు వెళ్ళిన ఆమె వంటశాలను తనిఖీ చేయగా ఫ్రిజ్‌లో మాంసంతో పాటు వంట పదర్థాలు వుండటాన్ని గుర్తించారు. అలాగే ఆ ఫ్రిజ్‌లో చాలా రోజుల క్రితం నుండి నిల్వ వుంచిన రొయ్యలు, చేపలు, మాంసంను కమీషనర్ గుర్తించారు. ఇందులో చాలా వరకు కుళ్ళిన స్థితిలో వుండటం పరిశీలించిన కమీషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం రద్దీగా వుండే హోటళ్ళల్లో సైతం మాంసం ఉత్పత్తులను ఫ్రిడ్జిల్లో వుంచడం ఏమిటని కమీషనర్ నిలదీశారు. ఆహార పదార్థాలను సీజ్ చేసి శాంపిల్స్ సేకరించి పట్టుకెళ్ళారు. అలాగే వంటశాల అపరిశుభ్రంగా వుండటంతో పాటు వ్యర్థాలను అక్కడే పడవేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్ళలో విధులు నిర్వహించే సిబ్బందికి గత రెండేళ్ళుగా ఎలాంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించకపోవడం ఆమె గుర్తించారు. అలాగే కమీషనర్ విష్ణుభవన్ హోటల్‌ను తనిఖీ చేసి వంటశాల, అల్పాహార పదార్థాలను పరిశీలించారు. వంటశాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమీషనర్ డాక్టర్ జె.అరుణ మాట్లాడుతూ నగర పరిధిలో గతంలో ఎన్నడు లేని విధంగా గత మూడు రోజులుగా 21 గ్యాస్ట్రో ఎంటిరైటిస్ కేసులు నమోదు అయ్యాయని, దీనికి తోడు ప్రజల నుండి ఫిర్యాదులు అందడంతో నగరంలో రద్దీగా వుండే రెండు హోటళ్ళను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు.

# అభివృద్ధికి ముందుకెళ్తున్న కౌన్సిల్‌కు ఎమ్మెల్యే భూమన అభినందనలు



తిరుపతి కార్పొరేషన్, జనవరి 18, ప్రభాతవార్త
తిరుపతి అభివృద్ధికి ముందుకెళ్తున్న కౌన్సిల్‌కు ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అభినందించారు. బుధవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ కౌన్సిల్ సమావేశం మేయర్ డా. శిరీషా అధ్యక్షతన కౌన్సిల్ ప్రత్యేక ఆహ్వానితులుగా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ అనుపమ అంజలి అజెండాను ప్రవేశపెట్టగా, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణ, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు కౌన్సిల్ అజెండాలోని అంశాలుపై చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తూ అందరి సహకారంతో ముందుకు వెల్లడం జరుగుతుందన్నారు. అభివృద్ధి ఆలోచనలతో ముందుకెళ్తున్న కార్పొరేటర్లకు, అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు తిరుపతి నగరంలో ఇరుకు రోడ్లు, జనసాంద్రత ఎక్కువ కల్గిన నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లు రావడం వలన నగరాభివృద్ధి శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇటీవల ప్రారంభించిన గెస్ట్ లైన్ రోడ్డు వలన గతంలో బస్టాండ్‌కు చేరాలంటే ఒకొక్కసారి 40 నిమిషాలు పట్టెదని గుర్తు చేస్తూ నేడు 4 నిమిషాల్లో చేరుకోవడం కొత్త రహదారి అభివృద్ధేనన్నారు. తిరుపతి నగరం ఆవిర్భావ దినోత్సవాన్ని ఫిబ్రవరి 24ను గొప్పగా అందరం కలిసి నిర్వహించాలని ఎమ్మెల్యే భూమన కోరారు. ఈ రాష్ట్రంలో కొత్త రోడ్లతో అభివృద్ధికై పరుగెడుతున్న నగరంగా తిరుపతి ముందుందని, తిరుపతి నగరాభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే భూమన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మేయర్ శిరీష మాట్లాడుతూ నగరంలో అనేక అభివృద్ధి పనులకు కౌన్సిల్ మొత్తం ఏకగ్రీవంగా కృషి చేస్తున్నదన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు అన్ని పూర్తి చేయడంతో ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు తగ్గుతుందని, ప్రజాభివృద్ధికి బాటలు వేసినట్లు అవుతుందని మేయర్ డాక్టర్ శిరీష స్పష్టం చేసారు. డిప్యూటి మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ కౌన్సిల్ ఆమోదంతో ప్రజాభివృద్ధి పనులకే తమ ప్రాధాన్యతని, మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మిస్తే తిరుపతి ప్రజలకు ఎంతో సౌకర్యం వస్తుందని, అదే విధంగా అభివృద్ధిలో ముందుకెల్లడం జరుగుతుందన్నారు. అనంతరం మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధికి అవసరమైన మాస్టర్ ప్లాన్ రోడ్లను పూర్తి చేసేందుకు 37 కోట్ల 61 లక్షలతో పనులను చేపట్టి ఈ మార్చి నాటికి పూర్తి చేయాలనే తీర్మానాన్ని కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. అదే విధంగా తిరుపతి కోర్టు రహదారి, మ్యూజిక్ కాలేజ్ వద్ద ఫ్రీ లెఫ్టుల కోసం 73 లక్షలతో పనులు చేపట్టెందుకు సమ్మతం జరిగిందని తిరుపతి అర్బన్ నివాసితులకు ఎం. కొత్తపల్లిలో కేటాయించిన ఇళ్లలో కొండ, వాగులు వున్నందున వాటిని సరిచేసి ఇవ్వడానికి 95 లక్షలతో పనులు చేపట్టెందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందని, లీజులు ముగిసిన షాపులకు అద్దె పెంచి లీజు కాలాన్ని పొడిగించాలనే అంశాలను తీర్మానించడం జరిగిందని మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.